సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కీసర: నాగారం మున్సిపాలిటీకి చెందిన గాయత్రి, సోనికి సీఎం సహాయనిధి కింద ఆర్థిక సాయం మంజూరైంది. కాగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ బాధితులకు ఆదివారం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనుగౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన దృశ్యం

మేడ్చల్: ప్రైవేట్‌కు దీటుగా అన్ని వసతులు ఉన్నాయని తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని కోరుతూ నూతన్‌కల్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వినూత్నంగా ప్రచారం చేస్తున్నాడు. ఈ మేరకు పదో తరగతి పరీక్షల్లో పాఠశాలలో టాపర్లుగా నిలిచిన విద్యార్థుల ఫొటోలు ఫ్లెక్సీలో ముద్రించి, పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం



రాధికాదేవి

జవహర్‌నగర్: వివాహిత అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శివకుమార్ నిషాద్, భార్య రాధికాదేవి (22) నగరానికి వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జవహర్‌నగర్ అరుంధతీనగర్‌లో నివాసముంటున్నారు. ఈనెల 17న శివకుమార్ పనికి వెళ్లి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చేసరికి రాధిక కనిపించలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆమెకోసం తెలిసిన వారి వద్ద, చుట్టుపక్కల వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి దేవాలయంలో చోరీ

బన్సీలాల్‌పేట్: న్యూబోయిగూడలోని అమ్మవారి దేవాలయంలో చోరీ జరిగింది. గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ తెలిపిన మేరకు.. న్యూబోయిగూడలోని గంగమ్మ దేవాలయంలో ఆదివారం ఉదయం ఓ అగంతకుడు చొరబడి అమ్మవారి బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లిపోయాడు. దేవాలయం కమిటీ సభ్యులు గాంధీనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సైదులేశ్వర్ తదితరులు క్లూస్ టీమ్‌తో దేవాలయానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. దొంగతనం జరిగిన తీరుతెన్నులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎవరూ లేని సమయంలో అగంతకుడు గుట్టుచప్పుడు కాకుండా అమ్మవారి దేవాలయంలోకి వెళ్లి అమ్మవారి మెడలోని బంగారు పుస్తెల తాడును అపహరించాడు. గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెట్ కేర్ సెంటర్‌లో వ్యక్తి మృతి



నితిన్

అడ్డగుట్ట: లాలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై గంగాధర్ తెలిపిన మేరకు .. వినోభా నగర్ ప్రాంతానికి చెందిన ముఖేష్ మూర్తి స్థానికంగా డాగ్స్ పెట్ కేర్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. మూడు రోజుల క్రితం నితిన్(45) అనే వ్యక్తి పనిలో చేరి అక్కడే పెంట్ హౌస్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం 11 గంటల సమయంలో నితిన్‌కు ముఖేష్ ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో పెంట్ హౌస్‌కి వెళ్లి చూడగా.. నితిన్ మృతి చెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛతపై పట్టింపేది?

బోడుప్పల్‌లో నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్లు

- రూ.79 లక్షలతో 12 చోట్ల ఏర్పాటు
- స్వచ్ఛ బోడుప్పల్‌లో భాగంగా టాయిలెట్ల నిర్మాణం
- పట్టించుకోని సంబంధిత అధికారులు



చెంగిచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్లు

బోడుప్పల్: స్వచ్ఛ బోడుప్పల్‌లో భాగంగా నగర పాలక సంస్థ పరిధిలో రూ.79 లక్షలతో 12 చోట్ల పబ్లిక్ టాయిలెట్లను నిర్మించారు. నిర్మాణాలు పూర్తై నాలుగేళ్లు కావస్తోంది. బోడుప్పల్‌ను స్వచ్ఛంగా ఉంచేందుకు వీటిని నిర్మించినా.. ఆ లక్ష్యం మాత్రం నెరవేరలేదు. నిర్మించిన వాటికి తాళాలు వేయగా.. మరికొన్నింటినీ పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు ఎదురౌతున్నాయి.

స్వచ్ఛ బోడుప్పల్‌గా తీర్చిదిద్దేందుకు..

☛ 2020 జూలై 6న బోడుప్పల్ నగర పాలక సంస్థను స్వచ్ఛ బోడుప్పల్‌గా తీర్చిదిద్దేందుకు అప్పటి పాలకవర్గం, అధికారులు ముందుకొచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జనలను నిర్మూలించేందుకు పబ్లిక్ టాయిలెట్లపై కౌన్సిల్‌లో చర్చించారు. అనంతరం 2020 -21 ఆర్థిక సంవత్సరం ఎల్‌ఆర్‌ఎస్ నిధుల నుంచి ఈ పబ్లిక్ టాయిలెట్లను నిర్మించేందుకు పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది.

☛ అదే ఏడాది డిసెంబర్ 18న నగర పాలక సంస్థ పరిధిలోని వారాంతపు సంతలు, బస్టాప్‌ల సమీపంలోని బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్రవిసర్జనను నిషేధించేందుకు పబ్లిక్ టాయిలెట్లకు తొలుత పాలకవర్గం ఆమోదించింది. వీటిని పట్టణ ప్రగతి నిధుల నుంచి నిర్మించేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపింది.

☛ 2021 ఫిబ్రవరి 5న నగర పాలక సంస్థ పరిధిలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణపై కౌన్సిల్‌లో పాలకవర్గం, అధికారులు చర్చించారు. ఇట్టి నిర్వహణను ఈఓఐ (ఎక్స్‌ప్రొసెసిన్ ఆఫ్ ఇంట్రెస్ట్) ఏజెన్సీ ద్వారా నిర్వహణ బాధ్యతలను అప్పగించాలని తీర్మానించారు.

☛ 2021 ఏప్రిల్ 10న నగర పాలక సంస్థ పరిధిలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లను పత్రికా ప్రకటన ద్వారా తక్కువకు కోట్ చేసిన సెవెన్ స్టార్స్‌కు అప్పగించారు. నిర్వహణకు అయ్యే రూ.2.50 లక్షలను పరిపాలన ఆమోదం కోసం కౌన్సిల్‌కు సమర్పించారు. తర్వాత ఆ దిశగా అడుగులు పడలేదు. దీంతో నిరుపయోగంగా మారాయి.

బోడుప్పల్‌లో నిర్మించినవి..

ఆర్‌ఎన్‌ఎస్ కాలనీ బస్టాప్ వద్ద, వీరారెడ్డినగర్ శ్మశానవాటిక, అంబేడ్కర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం, చెంగిచర్ల గ్రామపంచాయతీ కార్యాలయం, అన్నపూర్ణ రూ. 5 భోజనం, ఎస్‌బీఆర్ కాలనీ, ఎస్సీ శ్మశానవాటిక, యాదవ శ్మశానవాటిక , నగర పాలక సంస్థ కార్యాలయం టెర్రస్ పైన, ఎస్‌ఎన్‌ఎస్ కాలనీ, సాయినగర్ సబ్‌స్టేషన్, ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్మించారు.

వాడుకలోకి తీసుకురావాలి..

ఎంతో ఆర్భాటంగా ప్రజల సొమ్ముతో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లను వాడుకలోకి తీసుకురావాలి. రూ.79 లక్షలతో 4 ఏళ్ల క్రితం నిర్మించారు. ఇవి వాడుకలోకి రాకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మల మూత్రవిసర్జన చేస్తున్నారు. స్వచ్ఛ బోడుప్పల్ మాటిరుగు, పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్ల పక్కనే నిర్మించిన బహుళ అంతస్తు యజమాని అక్కడ నుంచి తొలగించారు. నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లు వాడుకలోకి తీసుకురావాలి.

– సంపత్ కుమార్, బోడుప్పల్

పరిసరాల పరిశుభ్రతకు కృషి



స్వచ్ఛ ర్యాలీలో కమిషనర్ శైలజ, కాలనీవాసులు

బోడుప్పల్: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ నడుం బిగిద్దామని బోడుప్పల్ కమిషనర్ శైలజ పిలుపునిచ్చారు. కేశవనగర్ కాలనీ అధ్యక్షుడు బసవరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛ కేశవనగర్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని, చెత్త,చెదారాన్ని ఇష్టానుసారంగా పారవేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించాలని కోరారు. కాలనీలు, రోడ్లు, ఖాళీ స్థలాల్లో ఇష్టానుసారంగా చెత్తవేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్తు తరాలకోసం ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. అనంతరం పార్కులో వ్యర్థాలను తొలగించి ర్యాలీ నిర్వహించారు.

స్కూల్ ప్రహరీ కూల్చివేత

- సోషల్ మీడియాలో వైరల్ కావడంతో..
- ఘటనా స్థలాన్ని సందర్శించిన ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి



కూల్చివేసిన స్కూల్ ప్రహరీ

కుషాయిగూడ: సరస్వతీ శిశుమందిర్ స్కూల్ ప్రహరీని కొంతమంది కూల్చివేశారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు స్కూల్‌పై దాడి అంటూ.. సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించారు. స్కూల్ ఆవరణలోనే పోచమ్మ ఆలయం ఉంది. ఈ ఆలయానికి, స్కూల్ సంబంధించిన స్థలం విషయంలో తేడాలు రావడంతో మూడేళ్ల క్రితమే ఆలయ కమిటీ ప్రతినిధులు, స్కూల్ ప్రతినిధులు హద్దులు నిర్ధారించుకుని ప్రహరీని నిర్మించారు. మూడేళ్ల తర్వాత ప్రహరీని కూల్చివేశారు. పోలీసుల విచారణలో ఆలయ ప్రతినిధులే కూల్చివేసినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. గతంలో జరిగిన చర్చలు, ఒప్పందాలపై కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి వారితో మాట్లాడి ఆరా తీశారు. స్థల విషయంలోనే ఈ ఘటన చోటుచేసుకుందని, ఇతర కారణాలు లేవని పోలీసులు వివరించారు.

కనుల పండువగా ప్రతిష్ఠాపనోత్సవాలు



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: నేరెడ్‌మెట్‌లోని అన్నపూర్ణ సహిత కాశీవిశ్వనాథాలయంలో రాజగోపురం, సతీసమేత నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండోరోజు రుద్రహోమం, నక్షత్ర నవగ్రహహోమం నిర్వహించారు. పూజాకార్యక్రమాలకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత కల్పించడమే కాకుండా క్రమశిక్షణ గల జీవనవిధానానికి మార్గంలా పని చేస్తుందన్నారు. ఆలయ నిర్వాహకులు దేవాలయ ప్రాసస్త్యాన్ని ఆయనకు వివరించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ గవర్నమెంట్ స్కూల్‌లైన్, పిట్టలబస్తీ రోడ్డు అభివృద్ధి కోసం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి చొరవతో రూ.50 లక్షలు మంజూరైన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు ఆదివారం పాలాభిషేకం చేశారు. మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కప్పర సాయికిరణ్‌గౌడ్, పీజీ.సుదర్శన్, దంతురి రాజుగౌడ్, బాలరాజుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, సురేష్, ఫసిముద్దీన్, మనోహర్, శైలజ, దిలీప్‌గౌడ్, నందులాల్, సోని, జయంత్, హర్షత్, భాను తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీకి సమస్యలు విన్నవిస్తున్న బాచుపల్లి డబుల్ బెడ్రూంవాసులు

మేడ్చల్: నగర శివారులోని బాచుపల్లిలో గల డబుల్ బెడ్రూం ఇళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పూడూర్‌లోని తన నివాసంలో ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాచుపల్లిలో 10 బ్లాకుల్లో 1080 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. బోర్లు లేక తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని అలాగే ప్రహరీ లేక విష పురుగులు వస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

హైవే నష్టపరిహారం తక్కువ

నాగ్‌పూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో తక్కువ నష్ట పరిహారం ఇస్తున్నారని భూ నిర్వాసితులు ఎంపీ ఈటల దృష్టికి తీసుకెళ్లారు. వాస్తవ విలువలో 20 శాతం నష్టపరిహారం రావడం లేదని వారు వాపోయారు.

పీహెచ్‌సీలో అత్యాధునిక దంత వైద్యం

అల్వాల్: మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యాధునిక దంత వైద్య విభాగం అభివృద్ధి చెందుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమాగౌరి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్తీక్ అనే వ్యక్తికి రోడ్డు ప్రమాదంలో ఎగువ దవడకు బలమైన గాయమైందని, దంత వైద్య నిపుణులు డాక్టర్ వినోద్ ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతికతతో పోస్ట్‌కోర్ క్రౌన్‌పిన్ ఫిక్సేషన్ చేశామన్నారు. ఎడమపై భాగంలోని లేటరల్ ఇన్‌స్పెజర్ పంటికి రూట్ కెనాల్ చికిత్స (ఆర్‌సీడీ) విజయవంతంగా పూర్తి చేశామని పేర్కొన్నారు. ఆధునాతన శస్త్రచికిత్సలు అందించడంలో డాక్టర్ వినోద్ సేవలు ప్రత్యేకమైన గుర్తింపు పొందుతున్నారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఉచిత వైద్య శిబిరం

బోడుప్పల్: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దానగల్ల యాదగిరి అన్నారు. బోడుప్పల్ 13వ డివిజన్ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వద్ద ఆదివారం కమల ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలు, మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతాల్లో తరుచుగా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయాలన్నారు. వైద్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాభూమి ది డెస్టినేషన్ ఆఫ్ ఆర్ట్స్ శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. గురువు మధుసూదన్ మోహన్‌రెడ్డిల శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మూషిక వాహన, విఘ్నరాజంభజే, అష్టలక్ష్మి, నమశ్శివాయతే, చూడరమ్మ, మహేశ్వరి మహంకాళి, వినాయక కౌతం, గజవదాన, భజరే గోపాలం, జతిస్వరం, రామాయణశబ్దం లాంటి అనేక అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

అంబేడ్కర్ వల్లే అన్ని వర్గాలకు సమన్యాయం



మాట్లాడుతున్న ప్రకాశ్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే అన్ని వర్గాలకు సమన్యాయం దక్కిందని నారపల్లి వజ్ర ఆస్పత్రి ఎండీ ప్రకాశ్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్‌కు చదువును దూరం చేయాలని కొందరు ప్రయత్నించిన ఆ కాలంలోనే లండన్ వెళ్లి విద్యనభ్యసించారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఎలాంటి సమస్యలు ఎదురైన ధైర్యంగా ఎదుర్కొని ముందుకెళ్లాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సత్యం, నర్సింగ్‌రావు, రామేశ్వర్, అంజయ్య, జగదీశ్, కష్ణంరాజు, ఉపేందర్, విష్ణు, భరత్‌కుమార్, అఖిల్, వివేక్, యాకేశ్, లలిత్ పాల్గొన్నారు.

మారోజు వీరన్నకు ఘన నివాళి



జవహర్‌నగర్: జవహర్‌నగర్ విశ్వబ్రాహ్మణ సంఘం జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక జయశంకర్ విగ్రహం వద్ద మారోజు వీరన్న వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాదిలో ఎన్నో ప్రజా ఉద్యమాలు చేసి పీడిత ప్రజలకు వీరన్న అండగా నిలిచారన్నారు. ప్రభుత్వం స్పందించి ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహం పెట్టాలని కోరారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ బీఎస్పీ అధ్యక్షుడు బిర్రు యాకస్వామి, మహనీయుల ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి పరశురాం, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామదాసు, వెంకటరమణచారి, జవహర్‌నగర్ అధ్యక్షుడు మారోజు సోమాచారి, మేడ్చల్ జిల్లా విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం అధ్యక్షుడు బాషపల్లి రమేశ్‌చారి, మండలాధ్యక్షుడు రమేశ్‌బాబు, సంఘం నాయకులు సదానందచారి, దయాకర్‌చారి, నర్సింహచారి, పుల్లయ్యచారి, గాలయ్యచారి, యాకచారి, రామాచారి, భైరవచారి, బ్రహ్మచారి, ఆంజనేయులుచారి, గిరిచారి, శ్రీనివాస్‌చారి, సత్యంచారి, సూర్యచారి తదితరులు పాల్గొన్నారు.

కులాంతర వివాహ జంటలకు బాండ్ల అందజేత

మేడ్చల్: ఎమ్మెల్యే మల్లారెడ్డి తన నివాసంలో కులాంతర వివాహ జంటలకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహక బాండ్లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలో ముగ్గురు కులాంతర వివాహం చేసుకోగా ప్రతీ జంటకు ప్రభుత్వం రూ.2.5లక్షల చొప్పున బ్యాంకు లో బాండ్ రూపంలో జమ చేసిందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ తులసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలు !

వ్యాపార సముదాయాల ముందు ఇష్టానుసారంగా పార్కింగ్

- ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



మిర్జాలగూడ చౌరస్తాలో..

గౌతంనగర్: ఫుట్‌పాత్‌లపై వ్యాపార సముదాయాలు వెలియడంతో ప్రమాదాలతో పాటు మల్కాజిగిరి సర్కిల్, గౌతంనగర్ డివిజన్ పరిధిలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. రూ.కోట్లను వెచ్చించి పాదచారుల కోసం రహదారులకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపడుతుండగా.. కొందరు వ్యాపారులు ఏకంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తూ.. వ్యాపారాలను చేస్తుండటంతో సగటు పాదచారికి నడిచేందుకు దారిలేక ప్రమాదాల పాలవుతున్నారు. పలు షాపుల యజమానులు, చిరువ్యాపారులు, ఫుట్‌పాత్‌లను అడ్డాగా చేసుకుని వ్యాపారం చేస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల బడా వ్యాపారులు సైతం అడ్డాలుగా మార్చుకుని ఫుట్‌పాత్‌లను అద్దెలకు ఇచ్చుకుంటున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

◆ ఆనంద్‌బాగ్ చౌరస్తా నుంచి వాణినగర్, సాయినగర్, మల్కాజిగిరి చౌరస్తా మీదుగా మిర్జాలగూడ చౌరస్తా వరకు ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని అడ్డగోలుగా వ్యాపారాలు చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జ్యోతినగర్ నుంచి మల్లికార్జుననగర్, గౌతంనగర్, దయానంద్‌నగర్ మీదుగా ఉత్తమ్‌నగర్ వరకు ఫుట్‌పాత్‌లు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో విశాలంగా ఉండాల్సిన రోడ్లు కాస్తా ఇరుకుగా మారి నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

రోడ్లపైనే వాహనాలు

పలు షాపింగ్‌మాల్స్, వ్యాపార సముదయాలకు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో కొనుగోలుదారులు రోడ్డుపైనే తమ వాహనాలను పార్క్ చేసి షాపింగ్ చేయాల్సి వస్తుంది. ఫుట్‌పాత్ ఆక్రమణలను అరికట్టేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని పలువురు ఆరోపిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే ప్రయాణికులతో రోడ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. ఇప్పటికైనా అటు జీహెచ్‌ఎంసీ అధికారులు, ఇటు ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా చర్యలు చేపట్టి ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, వ్యాపార సముదాయాల ముందు ఏర్పాటు చేసిన ఆక్రమణలను తొలగించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలి..

వాహనదారులు వారి వాహనాలను వ్యాపారాల సముదాయాల ముందు కాకుండా రోడ్లపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. వెంటనే అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

– జ్ఞానేశ్వర్, మిర్జాలగూడ